# నమస్తే తెలంగాణ

# ఆదిలాబాద్ - నిర్మల్

5 | నిజామాబాద్, శుక్రవారం 14 ఫిబ్రవరి 2025 | ADILABAD NIRMAL




మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

## ఆదిలాబాద్ మార్కెట్ అప్రతిష్టపాలు

- పత్తి కొనుగోళ్లలో అవినీతి జరగడం దారుణం
- ఎంపీ, ఎమ్మెల్యేల నిర్లక్ష్యంతోనే మార్కెట్ యార్డుకు మచ్చ
- మాజీ మంత్రి జోగు రామన్న

ఎదులాపురం, ఫిబ్రవరి 13 : సీసీఐ పత్తి కొనుగోళ్ల విషయంలో ఆదిలాబాద్ మార్కెట్ యార్డు అప్రతిష్ట పాలు అయిందని, గతంలో ఎన్నడులేని విధంగా అవినీతి జరగడం దారుణం అని, ఈ విషయమై కలెక్టర్ దృష్టిసారించి విచారణ జరపాలని మాజీ మంత్రి జోగు రామన్న డిమాండ్ చేశారు. స్థానిక బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ.. ఈ ఏడాది ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో దాదాపు 25 లక్షల క్వింటాళ్ల పత్తిని సీసీఐ కొనుగోలు చేసిందన్నారు. కొనుగోళ్లలో అవినీతి జరగడం, మార్కెట్ సెక్రెటరీని సస్పెండ్ చేసే పరిస్థితికి కారణమెంటని ప్రశ్నించారు. గత పదేళ్లలో ఇంతకంటే భారీ ఎత్తున కొనుగోళ్లు జరిగినా. ఎటువంటి అవినీతి ఆరోపణలు రాలేదని గుర్తు చేశారు. పక్క జిల్లాలు, రాష్ట్రాల నుండి పత్తిని తీసుకువచ్చి కౌలు రైతుల పేరిట విక్రయించారని, ఇందులో అధికారుల పాత్రపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ సీసీఐలో జరిగిన అవినీతిపై పూర్తి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇజ్జగిరి నారాయణ, మెట్టు ప్రహ్లాద్, మారిశెట్టి గోవర్ధన్, దమ్మాపాల్, కొండ గణేశ్, బట్టు సతీశ్, అప్కామ్ గంగయ్య, దాసరి రమేశ్, బుట్టి శివకుమార్, దేవీదాస్, అడపా తిరుపతి, నవతే శ్రీనివాస్, ఉగ్గే విఠల్, కలిమ్ పాల్గొన్నారు.

రిబ్బన్ కట్ చేస్తున్న నాయకులు



## స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదాం..

**బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం**

ఉట్నూర్, ఫిబ్రవరి 13 : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదామని బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ అన్నారు. గురువారం స్థానిక అంగడీ బజార్‌లో పార్టీ కార్యాలయాన్ని మాజీ జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, మాజీ ఎంపీటీసీ రాథోడ్ చారులత, మాజీ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే ఓడిపోతామన్న భయంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించడం లేదన్నారు. త్వరలోనే కేసీఆర్, కేటీఆర్‌లు నియోజకవర్గ నాయకులతో మీటింగ్‌లు నిర్వహించే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెందూర్ ప్రభాకర్, విజయ్, సోనేరావు, సలీం, కాటం రమేశ్, సింగారే భరత్, సత్యం, అంకవ్వ పాల్గొన్నారు.



### రోజుకు 91 లీటర్ల పాలు పోస్తా..

నేను గేదెలు, ఆవుల పెంపకంతో ఉపాధి పొందుతున్నా. బ్యాంకు లోన్ తీసుకుని పాడి పశువులను పెంచుకుంటున్నా. రోజు విజయ డెయిరీకి 91 లీటర్ల పాలు పోస్తా. గుడిహత్నూర్ నుంచి 20 కిలోమీటర్ల దూరం తీసుకెళ్లి పాలను విక్రయిస్తా. మాకు ప్రతి పక్షం రోజులకు ఒకసారి పాలు అమ్మిన పైసలు రావాలి. ప్రస్తుతం 45 రోజులు అవుతున్నా పాల పైసలు రావడం లేదు. విజయ డెయిరీ అధికారులను పైసలు అడిగితే హైదరాబాద్ ఆఫీస్ నుంచి మీ బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని అంటున్నారు. ఎప్పుడు వస్తాయని చెప్పడం లేదు. పైసలు వస్తాయనే నమ్మకంతో విజయ డెయిరీకి పాలు పోస్తున్నా. సరిగా డబ్బులు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది అవుతున్నది.

**- అర్జున్, పాడి రైతు, గుడిహత్నూర్**



ఆదిలాబాద్ విజయ డెయిరీ పాల కేంద్రం

# పాల బిల్లులు రాక.. పాడి రైతుల గోస



### అప్పుల పాలయ్యాం..

నేను బ్యాంకులో రుణం తీసుకుని 15 ఆవులను కొనుగోలు చేశా. రోజు ఇచ్చోడ విజయ డెయిరీకి 50 లీటర్ల పాలను అమ్ముతా. ఉపాధి కోసం పాడి పశువులను కొనుగోలు చేసిన నేను డెయిరీకి పాలు విక్రయించి ఇబ్బందులు పడాల్సి వస్తుంది. నెలల తరబడి పాలు అమ్మిన పైసలు రావడం లేదు. దీంతో పశువుల మేత, పాల రవాణా, ఇతర ఖర్చులకు అప్పులు చేయాల్సి వస్తున్నది. బ్యాంకు అప్పులకు తోడు ప్రైవేటు అప్పుల కారణంగా నష్టపోవాల్సి వస్తుంది. రైతులు పాలు విక్రయించిన డబ్బులను అధికారులు క్రమం తప్పకుండా ఇస్తే బాగుంటుంది. డబ్బుల గురించి అధికారులను అడిగితే స్పందించడం లేదు.

**- రాజు, పాడి రైతు, గుడిహత్నూర్**

- బ్యాంకు కిస్తీలు, దాణా, రవాణా ఖర్చులకు రైతుల పరేషాన్
- మూడబడే దిశగా పాలశీతలీకరణ కేంద్రాలు
- జోరుగా ప్రైవేటు డెయిరీల విక్రయాలు

## రెండు నెలలుగా డబ్బులు చెల్లించని విజయ డెయిరీ

ఆదిలాబాద్, ఫిబ్రవరి 13(నమస్తే తెలంగాణ) : కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఓ వెలుగు వెలిగిన విజయ డెయిరీ పరిస్థితి ప్రస్తుతం ఘోరంగా తయారైంది. కాంగ్రెస్ ప్రభుత్వం పాడి రైతులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో నెలల తరబడి బిల్లులు రావడం లేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,614 మంది రైతులు పాలు పోస్తున్నారు. ఇందుకు సంబంధించి ప్రతి పక్షం రోజులకు ఒకసారి ప్రభుత్వం డబ్బులు చెల్లించాలి. పక్షం రోజుల బిల్లు రూ.40 లక్షలు అవుతుండగా.. రెండు నెలలుగా రైతులకు పైసలు రావడం లేదు. దీంతో ఉపాధి కోసం బర్రెలు, ఆవులను పెంచుకుని విజయ డెయిరీకి విక్రయించిన పాల పైసలు రాకపోవడంతో రైతులు ఆర్థికంగా చితికిపోతున్నారు. గతంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3 వేల మంది రైతులు పాలను విక్రయించగా.. బిల్లుల సమస్యల కారణంగా రైతుల సంఖ్య తగ్గింది. పాల సేకరణ తగ్గడంతో ప్రస్తుతం నడుస్తున్న పాల శీతలీకరణ కేంద్రాలు మూతబడే పరిస్థితి ఉంది.

**బ్యాంక్ కిస్తీలకు డబ్బుల్లేవ్..**

వ్యవసాయం చేసే రైతులతోపాటు పాడి రైతులు బర్రెలు, ఆవులను పెంచుతూ పాలను విక్రయిస్తుంటారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 654 మంది పాడి రైతులకు ముద్ర పథకంలో రూ.2 లక్షల బ్యాంకు రుణాలు మంజూరయ్యాయి. విజయ డెయిరీ ఆధ్వర్యంలో అధికారులు రైతుల వద్ద నుంచి రోజు ఉదయం, సాయంత్రం పాలను సేకరిస్తారు. పాలలో వెన్నె శాతం ఆధారంగా రైతులకు డబ్బులు చెల్లిస్తారు. విజయ డెయిరీకి పాలు పోసే రైతులందరికీ ప్రతి పక్షం రోజులకు ఒకసారి వారి బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయి. డెయిరీ నుంచి పాల సేకరణ బాగా జరుగుతుండడంతో రైతులు బ్యాంకులు, ఇతర సంస్థల్లో రుణాలు తీసుకుని బర్రెలు, ఆవులు కొనుగోలు చేసి డెయిరీలు ఏర్పాటు చేసుకుని పాల వ్యాపారం చేస్తున్నారు. రైతులు అమ్మిన పాల డబ్బులు ఖాతాల్లో విజయ డెయిరీ ప్రధాన కార్యాలయం నుంచి జమ అవుతాయి. రైతులకు గతేడాది సెప్టెంబరు రెండో పక్షం డబ్బులతోపాటు డిసెంబర్ రెండో పక్షం, జనవరి నెల డబ్బులు రాలేదు. తమకు రావాల్సిన పైసల కోసం పాడి రైతులు అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం ఉండడం లేదు. దీంతో బర్రెలు, ఆవుల పెంపకం కోసం రైతులు తీసుకున్న బ్యాంకు రుణాలు చెల్లించలేకపోతున్నారు. నెలల తరబడి లోన్ కట్టకపోవడంతో వడ్డీ తడిసి మోపెడవుతుంది. బ్యాంకు అధికారులు ప్రతి నెల కిస్తీలు చెల్లించాలని రైతులకు సూచిస్తున్నారు. హైదరాబాద్ డెయిరీ కార్యాలయం నుంచి డబ్బులు మీ బ్యాంకు ఖాతాల్లో పడుతాయని, తాము ఏమీ చేయలేమని విజయ డెయిరీ అధికారులు సమాధానం ఇస్తున్నారని రైతులు అంటున్నారు.

**జోరుగా ప్రైవేటు డెయిరీల విక్రయాలు**

ఆదిలాబాద్ జిల్లాలో పలు ప్రైవేటు డెయిరీలకు చెందిన పాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. కరీంనగర్, వరంగల్, హైదరాబాద్, మహారాష్ట్రలోని నాగ్‌పూర్ ప్రాంతాల్లో గల ప్రైవేటు డెయిరీల పాల ప్యాకెట్లను ఆదిలాబాద్ జిల్లాలో విక్రయిస్తున్నారు. రోజు దాదాపుగా 60 వేల లీటర్ల పాలు ఇతర ప్రాంతాల నుంచి వస్తున్నాయి. విజయ డెయిరీకి పాల సేకరణ లేకపోవడంతో వారు సరిగా విక్రయాలు జరపడం లేదు. పాల పదార్థాలు తయారు చేయడానికి సరిపడా పాలు లేకపోవడంతో డెయిరీ సిబ్బంది ఏమి చేయలేని పరిస్థితి నెలకున్నది.



జిల్లాలోని ఓ రైస్‌మిల్లుకు సీఎంఆర్ కోసం వడ్లను తీసుకొచ్చిన లారీ



తాజాగా లక్ష్మణచాంద మండలం తిరుపెల్లి రైస్‌మిల్లులో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

# ముగిసిన సీఎంఆర్ గడువు

## నిర్మల్ జిల్లాలో 80,922 మెట్రిక్ టన్నుల బియ్యం బకాయి

- ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకోని మిల్లర్లు
- కోట్లాది రూపాయలు విలువ చేసే ధాన్యం గోల్‌మాల్
- వడ్లను అమ్ముకుని పీడీఎస్ బియ్యం రీ సైక్లింగ్ చేస్తున్నట్లు ఆరోపణలు
- తాజాగా తిరుపెల్లి రైస్ మిల్లులో రూ.7 కోట్ల సీఎంఆర్ ధాన్యం మాయం

నిర్మల్, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ) : నిర్మల్ జిల్లాలో సీఎంఆర్ అప్పజెప్పే విషయంలో రైస్ మిల్లర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. 2023-24 వానకాలం, యాసంగి సీజన్‌లకు సంబంధించిన కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) చెల్లింపు విషయంలో ఇప్పటికే పలుమార్లు గడువు విధించిన ప్రభుత్వం.. మరోసారి గత జనవరి 31వ తేదీ వరకు గడువును పెంచింది. అయితే ఈ గడువు కూడా ముగిసినప్పటికీ రైస్ మిల్లర్లు మాత్రం తమకు కేటాయించిన కోటాకు అనుగుణంగా బియ్యాన్ని అప్పగించలేదు. 2023-24 వానకాలంకు 1,42,759 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైస్ మిల్లర్లకు సీఎంఆర్ కోసం కేటాయించారు. ఇందుకు బదులుగా మిల్లర్లు 95,942 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రభుత్వానికి తిరిగి ఇవ్వాలి. అయితే ఇప్పటి వరకు 89,106 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మాత్రమే ఇచ్చారు. ఇంకా 6,836 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని ఇవ్వాల్సి ఉన్నది. అలాగే 2023-24 యాసంగి సీజన్ సీఎంఆర్ చెల్లింపులో జిల్లాలోని మిల్లర్లు తీవ్ర నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. అధికారులు ఇప్పటికే పలుమార్లు హెచ్చరించినప్పటికీ రైస్ మిల్లర్లు మాత్రం సీఎంఆర్ బియ్యాన్ని తిరిగి ఇవ్వడంలో జాప్యం చేస్తూ వస్తున్నారు. దీంతో అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. యాసంగికి సంబంధించి 1,56,847 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సీఎంఆర్ కోసం జిల్లాలోని రైస్ మిల్లులకు కేటాయించారు. ఈ కేటాయింపులకు అనుగుణంగా 1,05,697 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రభుత్వానికి సీఎంఆర్ కింద మిల్లర్లు అప్పజెప్పాలి. ఇప్పటి వరకు కేవలం 31,311 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మాత్రమే ఇచ్చారు. ఇంకా 74,086 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని ప్రభుత్వానికి మిల్లర్లు బకాయి ఉన్నారు. ఇలా జిల్లాలోని మిల్లర్లు.. రెండు సీజన్లకు కలిపి మొత్తం 80,922 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బకాయి ఉన్నారు. ఈ బకాయిలను గత నెల 31లోపు ఇవ్వాలని ప్రభుత్వం గడువు విధించింది. ఇప్పటికే ఈ గడువు ముగియగా, మిల్లర్లలో కనీస చలనం కనిపించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. గతేడాది యాసంగికి సంబంధించి మిల్లుల నుంచి బియ్యం తక్కువగా వచ్చినప్పటికీ సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలోని మొత్తం 49 మంది మిల్లర్లకు గాను కేవలం ఇద్దరు మాత్రమే ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేసినట్లు తెలిసింది. ఇంకా 47 మిల్లులు సీఎంఆర్ బకాయి ఉన్నాయి. ప్రభుత్వం సీఎంఆర్ కోసం ఇచ్చిన నాణ్యమైన ధాన్యాన్ని బహిరంగ మార్కెట్‌లో అమ్ముకుంటున్న కొందరు మిల్లర్లు.. పేదల కోసం ప్రభుత్వం సరఫరా చేస్తున్న పీడీఎస్ బియ్యాన్ని రీ సైక్లింగ్ చేసి సీఎంఆర్ కింద వాటినే పంపుతున్నట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు వినిపిస్తున్నాయి. పేదల బియ్యాన్ని కొందరు అక్రమార్కులు కొనుగోలు చేసి మిల్లులకు సరఫరా చేస్తున్నట్లు తెలుస్తున్నది. ఇలా తక్కువ ధరకు సేకరించిన బియ్యాన్ని రీ సైక్లింగ్ చేసి సీఎంఆర్‌గా చూపుతున్నారు. సీజన్‌లో వచ్చే ధాన్యాన్ని బహిరంగ మార్కెట్‌లో విక్రయించుకుని సీఎంఆర్ గడువు ముగిసే సమయంలో కొంతమంది అక్రమార్కులు పీడీఎస్ బియ్యాన్ని సేకరించి అధికారులను మేనేజ్ చేస్తూ లక్ష్యం పూర్తి చేసినట్లుగా చూపిస్తున్నట్లు సర్వత్రా ఆరోపణలున్నాయి.

**కోట్ల రూపాయల ధాన్యం మాయం**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సీఎంఆర్ అంటే చాలు అటు మిల్లర్లకు, ఇటు అధికారులకు పంట పండేది. అన్నదాతల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసే ధాన్యాన్ని మిల్లింగ్ కోసం తీసుకుని ఎగనామం పెట్టడం చాలా చోట్ల మిల్లర్లకు అనవాయితీగా వస్తున్నది. అడపా దడపా మిల్లర్లపై కేసులు నమోదు చేయడం, రికవరీకి చర్యలు తీసుకోవడం జరిగేది. గతంలో ఎగనామం పెట్టిన చాలా మిల్లుల నుంచి ఇప్పటికీ జిల్లాలో కోట్లాది రూపాయల బకాయిలు రావాల్సి ఉన్నట్లు చెబుతున్నారు. రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం ఆస్తులు జప్తు చేయాల్సి ఉన్నప్పటికీ అది కూడా తూతూ మంత్రంగానే కొనసాగుతున్నదనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరను కల్పిస్తూ ఐకేపీ, పీఏసీఎస్ వంటి ప్రభుత్వ సంస్థల ద్వారా కొనుగోలు చేయిస్తున్నది. ఇలా కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసేందుకు జిల్లాలోని ప్రైవేటు రైస్ మిల్లులకు అందజేస్తున్నది. అయితే గడువులోగా ఆయా మిల్లర్లు ధాన్యాన్ని మిల్లింగ్ చేసి నిబంధనల మేరకు బియ్యాన్ని తిరిగి ప్రభుత్వానికి అందజేయాల్సి ఉంటుంది. చాలా మంది మిల్లర్లు నిర్దేశిత గడువులోగా ప్రభుత్వానికి బియ్యం అందజేయడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. 2022-23 సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా దాదాపు 100 కోట్ల రూపాయలకు పైగా విలువ గల సీఎంఆర్ ధాన్యం మాయమైనట్లు అధికారుల తనిఖీల్లో వెల్లడైంది. ఇందులో 16 రైస్ మిల్లులను అప్పట్లో డిఫాల్టర్లుగా ప్రకటించడమే కాకుండా, అక్రమాలకు పాల్పడ్డ మరో ఏడు రైస్ మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో వానకాలం, యాసంగి సీజన్‌కు సంబంధించి జిల్లాలోని ఏడు రైస్ మిల్లులు రూ.107 కోట్ల విలువైన ధాన్యాన్ని పక్కదారి పట్టించినట్లు అధికారులు నిర్ధారించారు. తాజాగా సోమవారం జిల్లాలోని లక్ష్మణచాంద మండలం తిరుపెల్లి గ్రామంలో గల ప్రతిమ రైస్ మిల్లులో అధికారులు తనిఖీలు నిర్వహించగా అనేక అక్రమాలు బయటపడ్డాయి. సదరు మిల్లులో ఏకంగా రూ.7 కోట్లకు పైగా విలువ చేసే సీఎంఆర్ మాయమైనట్లు అధికారులు గుర్తించారు. అప్పటికే 1500 బస్తాల వరి ధాన్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉంచిన లారీలను సీజ్ చేశారు. ఇప్పటి వరకు మొత్తం 30,112 క్వింటాళ్ల ధాన్యం మిల్లు నుంచి మాయం అయినట్లు తేల్చి మిల్లు యజమానిపై కేసు నమోదు చేశారు. ఇలా తరచూ అధికారులు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నప్పటికీ మిల్లర్ల తీరులో మాత్రం మార్పు రావడం లేదు. అక్రమాలకు పాల్పడ్డ మిల్లర్లపై అధికారులు తూతూ మంత్రంగా చర్యలు చేపట్టడం కాకుండా, కఠిన చర్యలు తీసుకుంటేనే మిగతా మిల్లర్లు సీఎంఆర్ చెల్లింపులు సక్రమంగా చేపట్టే అవకాశం ఉందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

## ఎమ్మెల్సీ బరిలో 71 మంది

- రెండు స్థానాలకు 13 మంది విత్‌డ్రా
- పోటీలో పట్టభద్రుల స్థానానికి 56 మంది.. ఉపాధ్యాయ స్థానానికి 15 మంది..

### ముగిసిన ఉపసంహరణ

కరీంనగర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 13 : కరీంనగర్- మెదక్- నిజామాబాద్- ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో ప్రధాన అంకం ముగిసింది. ఉపసంహరణకు గురువారం తుదిరోజు కాగా, రోజంతా ఉత్కంఠ కనిపించింది. మొత్తం 13 మంది విత్ డ్రా తర్వాత 71 మంది అభ్యర్థులు బరిలో ఉన్నట్టు తేలింది. ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించగా, పట్టభద్రుల స్థానానికి వంద మంది, ఉపాధ్యాయ స్థానానికి 17 మంది నామినేషన్లు దాఖలు చేశారు. పరిశీలన అనంతరం గ్రాడ్యుయేట్ స్థానం నుంచి 32 తిరస్కరించి 68 మంది నామినేషన్లు, టీచర్ స్థానం నుంచి ఒకటి తిరస్కరించి 16 మంది నామినేషన్లు ఆమోదించారు. గురువారం సాయంత్రం వరకు విత్‌డ్రాకు అవకాశముండగా, పట్టభద్రుల స్థానం నుంచి 12 మంది, ఉపాధ్యాయం స్థానం నుంచి ఒకరు ఉపసంహరించుకున్నారు. ఇక పట్టభద్రుల స్థానానికి 56 మంది, ఉపాధ్యాయ స్థానానికి 15 మంది బరిలో నిలిచారు. వీరంతా నేటి నుంచి ప్రచారం హోరెత్తించనున్నారు. ఇప్పటి నుంచి నేరుగా ఓటర్లను కలుస్తూ, ఓట్లు అభ్యర్థించేందుకు సిద్ధమయ్యారు.

**ఉపసంహరించుకున్నది వీరే..**

పట్టభద్రుల స్థానం నుంచి మంచిర్యాల జిల్లా దేవునిగూడకు చెందిన గవ్వల లక్ష్మి, కరీంనగర్ పట్టణానికి చెందిన ఎడ్ల సాయికృష్ణప్రియ, సంగారెడ్డి జిల్లాకు చెందిన నాలకంటి యాదగిరి, కోవూరి సత్యనారాయణగౌడ్, జగిత్యాల జిల్లాకు చెందిన ఆలగొండ కృష్ణహరి, నల్లగొండ జిల్లాకు చెందిన రేకల సైదులు, రంగారెడ్డి జిల్లాకు చెందిన లింగాల శ్రీనివాస్, నిజామాబాద్ జిల్లాకు చెందిన మదనం గంగాధర్, సూర్యాపేట జిల్లాకు చెందిన సోమగాని నరేందర్, లింగం కృష్ణ, దార మనోహర్, బడే నర్సయ్య నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. ఉపాధ్యాయ స్థానానికి మంచిర్యాల జిల్లాకు చెందిన గవ్వల శ్రీకాంత్ విత్ డ్రా అయ్యారు.

## ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

**కలెక్టర్ అభిలాష అభినవ్**




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, ఫిబ్రవరి 13 : పంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ సమావేశ మందిరంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణ, ఆర్వో, ఏఆర్వోల విధుల అంశాలపై రిటర్నింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నామినేషన్ల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్ కుమార్, డీపీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### శానిటరీ నాప్కిన్ యూనిట్ ప్రారంభం

ఉట్నూర్, ఫిబ్రవరి 13 : ఉట్నూర్ డివిజన్ కేంద్రంలో శానిటరీ నాప్కిన్ కేంద్రాన్ని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాతో కలిసి కలెక్టర్ రాజర్షి షా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన గిరిజన మహిళా సంఘాలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా పట్టణంలోని మహిళాతో నాగోబా జాయింట్ లయాబిలిటీ గ్రూప్ ఆధ్వర్యంలో శానిటరీ నాప్కిన్ మేకింగ్ యూనిట్‌ను రూ.12 లక్షలతో ప్రారంభించామన్నారు. సబ్ కలెక్టర్ రాహుల్‌లు పాల్గొన్నారు.

### ముగిసిన డ్రోన్ టెక్నాలజీ వర్క్‌షాప్



డ్రోన్ టెక్నాలజీ వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమంలో వీసీ గోవర్ధన్

బాసర, ఫిబ్రవరి 13 : బాసర ఆర్జీయూకేటీలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న డ్రోన్ టెక్నాలజీ వర్క్‌షాప్ గురువారం ముగిసింది. ఆర్జీయూకేటీ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం, టీ హాన్ ఐఐటీ సహకారంతో డ్రోన్స్ డిజైన్ అండ్ ఫ్లై అనే అంశంపై ఐదు రోజులు వర్క్‌షాప్ విజయవంతంగా ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ట్రిపుల్ ఐటీ వీసీ గోవర్ధన్, ఓఎస్డీ ప్రొఫెసర్ మురళీదర్శన్‌తో కలిసి హాజరయ్యారు. ఓఎస్డీ ప్రొఫెసర్ మురళీదర్శన్, ఏవో రణధీర్, కో-ఆర్డినేటర్ డాక్టర్ నామని రాకేశ్, హెచ్‌వోడీ బావ్‌సింగ్, లక్ష్మణ్ ముత్యం పాల్గొన్నారు.